సాక్షి
ములుగు

బుధవారం | 12 ఏప్రిల్ | 2023



బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం.. కార్యకర్తలే బల మని, దేశంలో ఏ పార్టీకి లేనంత 80 లక్షల కార్యకర్తల బలగం మనదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 8లో ▸



నేటి నుంచి దూరవిద్య పీజీ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నేటి నుంచి (12వ తేదీ) పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.0° /25.0°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదక రంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:37	గురు 4:38

ధాన్యం సేకరణకు రెడీ

యాసంగి కొనుగోళ్ల ప్రణాళికలు

- భూపాలపల్లి జిల్లాలో 213 కొనుగోలు కేంద్రాలు
- ఏర్పాట్లు చేస్తున్న సివిల్ సప్లై అధికారులు
- 89,799 ఎకరాల్లో సాగు
- ధాన్యం దిగుబడి అంచనా 1.30 లక్షల మెట్రిక్ టన్నులు



భూపాలపల్లి: యాసంగి(రబీ)లో రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. భూపాలపల్లి జిల్లాలో వరిసాగు విస్తీర్ణం, దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వడ్ల కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెల చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వడ్లను కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

వానాకాలం మాదిరిగానే కేంద్రాలు..

వానాకాలం సీజన్ మాదిరిగానే ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పీఏసీఎస్, ఐకేపీ (మహిళా సంఘాలు), రైతు సంఘం, ఓడీసీఎంఎస్, కేడీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో గత వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 213 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా యాసంగిలో కూడా అవే స్థానాల్లో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతుల డిమాండ్ ఆధారంగా అవసరమైతే కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే వరికోతలు మొదలయ్యాయి. మరోవారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఒక నెల ఆలస్యంగా వరిసాగు ప్రారంభం అవుతుంది. దీంతో ఈ నెల చివరి వారంలో ధాన్యం చేతికి వచ్చే అవకాశం ఉన్నందున ఆ సమయంలోనే అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

ఆ నాలుగు ఏజెన్సీలు రద్దు..

వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ఎదుర్కొన్న సమస్యలు తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కాటారం మండలంలోని మల్లారం, లక్ష్మీపూర్, విలాసాగర్ కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో రైతులకు ఇబ్బంది తలెత్తింది. భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట కేంద్రం నిర్వాహకుడు పదిమందికి పైగా రైతులు విక్రయించిన ధాన్యాన్ని తన పేరుపై నమోదు చేసుకున్నాడు. ఆయా సమస్యలతో రైతులకు డబ్బులు సకాలంలో రాక ఇబ్బంది తలెత్తింది. దీంతో ఈసారి ఆ కేంద్రాల్లో ఏజెన్సీలను మార్చనున్నారు.

నాణ్యత ఉంటేనే కొనుగోలు..

గతంలో మాదిరిగానే ధాన్యం నాణ్యత ఉంటేనే రైతుల నుంచి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు సమాచారం. ఈ మేరకు ఒక శాతంలోపు తాలు, 17శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే పౌరసరఫరాలశాఖ అధికారులు కొనుగోలు చేయనున్నారు.

89,799 ఎకరాల్లో సాగు..

ఈ యాసంగి సీజన్‌లో భూపాలపల్లి జిల్లాలోని 11మండలాల్లో రైతులు 89,799 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ మేరకు 1.20నుంచి 1.30లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

రైతులకు ఇబ్బంది రానివ్వం..

ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది రానివ్వం. అవసరమైన ప్రతీచోట కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి సిబ్బందిని నియమిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తాం.

- రాఘువేందర్,
జిల్లా మేనేజర్, పౌరసరఫరాలశాఖ

213 కొనుగోలు కేంద్రాలతో పాటు అవసరమైనన్ని గన్నీబ్యాగులు, తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సదాలమ్మను గంగా స్నానానికి తీసుకెళ్తున్న పూజారులు



నేటినుంచి సడాలమ్మ జాతర

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలో భూపతిపూర్ గ్రామంలో ఈనెల 12 నుంచి 15వరకు బేరం బోయిన వంశం 6వ గొట్టు వంశానికి సంబంధించిన కారుకొండ సడలమ్మ జాతరను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో హాజరై తల్లుల దీవెనలు పొందాలన్నారు. అంతరించిపోతున్న ఆదిమ తెగల సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. పూర్వం అన్నారం గడి రాజ్యంలో కోయ రాజ్యాల పరిపాలనలో జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటికీ గడి బావి కోట ఆధారాలు సజీవంగా ఉన్నాయన్నారు. గోదావరి నదిలో పవిత్ర గంగా స్నానం పూర్తి చేసుకున్న దేవర, గుట్ట నుంచి పకతి రూపంలో వచ్చి బుధవారం గద్దెలకు చేరుతుందన్నారు. ఈ జాతర సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుకొండ సడాలమ్మ జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బడే రాంబాబు, ఉపాధ్యక్షులు బచ్చలి వెంకటేష్, దన్నూరి పోతురాజు, పూజారులు ఝెట్టి మహేష్, ప్రకాశ్, ఝెట్టి వెంకటేష్, వడ్డెలు కిరణ్, ఆదివాసీ నాయకులు పాయం కల్యాణ్, తాటి నవీన్ పాల్గొన్నారు.

15న నిరుద్యోగ మార్చ్

ములుగు రూరల్/ వెంకటాపురం(కె)/ ఎస్‌ఎస్‌ తాడ్వాయి: ఈ నెల 15న హనుమకొండలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను నిరుద్యోగులు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ములుగు, వెంకటాపురం(కె), ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలకేంద్రాల్లో మంగళవారం జరిగిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమారు 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మాదరి శ్రీకాంత్, ములుగు మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్, ఎస్‌ఎస్‌తాడ్వాయి మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, రవీంద్రాచారి, వాసుదేవరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గాజుల కృష్ణ, కొండారెడ్డి పాల్గొన్నారు.



ములుగు రూరల్: మాట్లాడుతున్న భాస్కర్

న్యూస్‌రీల్

పదేళ్లకోసారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి

అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర

భూపాలపల్లి: జిల్లా ప్రజలందరూ పదేళ్లకోసారి ఆధార్, మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన డీఎల్‌ఏఎంసీ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి రేషన్‌కార్డు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు వంటి వాటిని ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ వినయ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

కాటారం: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేడు(బుధవారం) మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరయ్యే లబ్ధిదారులు మైనార్టీ వర్గాలకు చెందిన వారై ఉండాలన్నారు. సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షల లోపు ఉండాలని చెప్పారు. 21నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. తప్పనిసరిగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకొని రావాలని ఎంపీడీఓ సూచించారు.

హాస్టల్‌ను ప్రారంభించాలి



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్ వసతిని ప్రారంభించాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కళాశాల ఎదుట ఎస్‌ఎస్‌యూఐ నాయకులు ధర్నా చేపట్టారు. కళాశాల విద్యార్థుల కోసం నిర్మించిన హాస్టల్ భవన పనులు పూర్తయి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. కళాశాల లెక్చరర్ల నియామకాల్లో నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. హాస్టల్‌ను వెంటనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, ప్రేమ్, అను, అఖిల్, కార్తీక్, నవీన్, సిద్దులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలించిన భద్రత కమిటీ

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని మహదేవపూర్ నుంచి రేగొండ వరకు 353సీ జాతీయ రహదారిని రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించినట్లు ఆర్అండ్‌బీ డీఈఈ రమేష్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారుల శాఖ, ఆర్‌టీఓ, పోలీసు శాఖలకు సంబంధించిన అధికారులు కలిసి రోడ్డును పరిశీలించి బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. బ్లాక్ స్పాట్‌ను తొలగించుట కోసం తగిన అంచనా నివేదికను త్వరలో కలెక్టర్ భవేష్‌మిశ్రాకు సమర్పించనున్నట్లు తెలిపారు.

రికార్డుల తనిఖీ



చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను జెడ్పీ సీఈఓ రఘువరన్ మంగళవారం ఆకస్మిక తనిఖీచేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట సర్పంచ్ కసిరెడ్డి సాయి సుధ రత్నాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుచరితరెడ్డి ఉన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ములుగు: ఆరోగ్య మహిళ ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య సూచించారు. జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మహిళలను మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ శిబిరాలు ప్రారంభం అయినప్పటి నుంచి ఆరో మంగళవారం వరకు 608 మంది స్త్రీలకు పరీక్షలు నిర్వహించగా 48 మందిని ఉత్తమ వైద్యచికిత్సల కోసం రెఫర్ చేశామని అన్నారు. గర్భాశయ వ్యాధులతో 33మంది ఇబ్బందులు పడుతున్నట్లుగా గుర్తించామని తెలిపారు. ఒక మహిళకు గర్భాశయ ఆపరేషన్ చేశామని చెప్పారు. ఐదుగురికి థైరాయిడ్ సమస్య ఉందని గుర్తించినట్లు తెలిపారు. ఒకరిని ఓరల్ క్యాన్సర్, ఇద్దరిని రొమ్ము క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించాలని చెప్పారు.

కోవిడ్ లక్షణాలపై జాగ్రత్తగా ఉండాలి..

ఇటీవల కోవిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరిస్తున్న కారణంగా అలాంటి లక్షణాలు ఎవరికైనా ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. చిన్నపాటి లక్షణం ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. సూపరింటెండెంట్ జగదీశ్వర్‌తో కలిసి వ్యాధి నిర్ధారణ, చికిత్సకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. దేశంలోని పలు రాష్ట్రాలలో కోవిడ్ వ్యాధి ప్రబలుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చికిత్స అందించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించిందని అప్పయ్య అన్నారు. వైద్యాధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

పోలీస్‌స్టేషన్ పనితీరు భేష్

ములుగు: 2023 సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన ములుగు పోలీస్ స్టేషన్ బెస్ట్ ర్యాంకు సాధించింది. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ తరఫున పనితీరును అభినందిస్తూ ములుగు భేష్ అంటూ మంగళవారం ప్రశంసలు దక్కాయి. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జరిగిన సమావేశంలో ఎస్పీ గాష్ ఆలం మాట్లాడుతూ ఇకపై మరింతగా పనితీరును మెరుగు పరుచుకోవాలని అన్నారు. కేసుల విచారణలో అన్ని రకాల నిబంధనలు పాటించి సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన స్టేషన్ అధికారులను అభినందించారు.



వీసీకి హాజరైన ఎస్పీ గాష్ ఆలం, సీఐ, ఎస్సైలు

ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ సుభాష్‌బాబు, సీఐ మేకల రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కమ్యూనికేషన్ సీఐ రోహిత్, ములుగు ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని డీఎంహెచ్‌ఓ, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మేడారం గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థినుల పరీక్షలు ముగిసి పాఠశాలను విడిచి వెళ్తున్న వారికి విద్యార్థినులతో ఆయన వృత్తి నైపుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఒక నాలుగు రోడ్ల జంక్షన్ లాంటిదని ఏ కోర్సులు తీసుకోవాలనేది నిర్ణయించుకొని ముందుకు సాగాలని సూచించారు. బైపీసీ తీసుకుంటే డాక్టర్, వెటర్నరీ డాక్టర్, దంత వైద్య నిపుణులు, ఆయుర్వేదిక్ డాక్టర్ వ్యవసాయ ఆఫీసర్ అవుతారని వివరించారు. ఎంపీసీ గ్రూపు తీసుకున్న విద్యార్థినులు ఇంజనీర్లు కావచ్చన్నారు. విద్యార్థినులు లక్ష్య సాధన కోసం శ్రమించాలన్నారు. జిల్లా విద్య నాణ్యత ప్రమాణాల ఆఫీసర్ బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సాంబయ్య, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరోజన, పీడీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్లెం అప్పయ్య

మహిళా విద్యకు మార్గదర్శకుడు

- పూలేను ఆదర్శంగా తీసుకోవాలి
- అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: మహిళా విద్యకు మార్గదర్శకుడు మహాత్మా జ్యోతిబాపూలే అని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన పూలే 197 జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వైవీ గణేశ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను నడిపించి వారి ఉన్నతికి ఆద్యుడిగా మారారని అన్నారు. బాల్య వివాహాలు సరికాదని.. ప్రతి ఒక్కరికీ విడమరిచి చెప్పడం ద్వారానే నేడు విద్యలో బాలికలు ఉన్నత విద్యలో రాణిస్తున్నారని అన్నారు. బాలికల విద్య, వెనుకబడిన తరగతుల సాధికారతకోసం పూలే ఎనలేని కృషిచేశారని గుర్తుచేశారు. నేటి తరం పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని సూచించారు. విద్యతోనే ఉన్నత స్థానం దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కూతాటి రమాదేవి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి లక్ష్మణ్, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ విజయ భాస్కర్, సూపరింటెండెంట్లు విశ్వప్రసాద్, రాజ్‌ప్రకాశ్, రవీందర్, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ గణేశ్

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో..

జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం నిర్వహించిన జ్యోతిబా పూలే జయంతి వేడుకలకు ఎస్పీ గాష్ ఆలం హాజరై పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల బాగుకోసం కృషి చేసిన పూలే ఆదర్శప్రాయుడని అన్నారు. సామాజిక సంఘ సంస్కర్తగా మారి తన భార్య సావిత్రిబాపూలేకు విద్య నేర్పించి నేటి తరానికి ఆదర్శప్రాయుడిగా మారిన గొప్పవ్యక్తి అని అన్నారు. పూలే జీవితం అందరికీ ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ సుభాష్‌బాబు, సీఐలు రవీందర్, శ్రీనివాస్, ఆర్ఐ వెంకటనారాయణ, కిరణ్, డీపీఓ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ నిర్మల, హెడ్ క్వార్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ

14న అంబేడ్కర్ జయంతి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్


ఏటూరునాగారం: ఈనెల 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటూరు నాగారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో 14న జరగబోయే అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, ఆదివాసీ ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కబ్బాక శ్రావణ్, వావిలాల స్వామి, వావిలాల సాంబశివరావు, ఈసం యాదయ్య, జబ్బ సమ్మయ్య, ఈసం రాజు, పడిదెల సతీష్ పాల్గొన్నారు.

17న హేమాచలక్షేత్రంలో జాతర వేలం

మంగపేట: రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఈనెల 17న జాతర బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రావణం సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల క్షేత్రంలో మే 1నుంచి 10 వరకు లక్ష్మీనర్సింహాస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు(జాతర) అత్యంత వైభవంగా జరుగనున్నట్లు చెప్పారు. గుట్టపై 10రోజుల పాటు జరిగే జాతరతో ఈనెల 25 నుంచి మే24 వరకు నెల రోజుల వరకు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల షాపులు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరిపేందుకు దేవాదాయశాఖ ద్వారా అనుమతి ఇచ్చేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు.

శిఖం భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

కాటారం: కాటారం గ్రామపంచాయతీ పరిధిలో ఊర చెరువులోని శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారిణి ఆశలత అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఊర చెరువు శిఖం చుట్టు ఏర్పాటు చేసిన హద్దులను మంగళవారం డీపీఓ పరిశీలించారు. శిఖం హద్దుల లోపల నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. శిఖం చుట్టు ఏర్పాటు చేసిన హద్దులను అతిక్రమించి ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఎవరైనా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈఈ, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అంతకముందు ప్రతాపగిరి పంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం డీపీఓ స్థల పరిశీలన చేశారు. గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరైనట్లు డీపీఓ తెలిపారు. ఫారెస్ట్ స్థలంలో భవన నిర్మాణం కోసం అభ్యంతరం ఉన్నందున ఫారెస్ట్ అధికారులతో చర్చించి స్థలం మంజూరు కోసం జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డీపీఓ వెంట ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తహసీల్దార్ జివాకర్ రెడ్డి, ఎంపీఓ ఉపేంద్రయ్య, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, షగీర్‌ఖాన్ ఉన్నారు.



శిఖం భూమి హద్దులను పరిశీలిస్తున్న డీపీఓ ఆశలత

23లోగా ఆత్మీయ సమ్మేళనాలు పూర్తిచేయాలి

ములుగు: ఈ నెల 23లోగా ఆత్మీయ సమ్మేళనాలను పూర్తిచేసుకొని 25న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సమావేశానికి హాజరుకావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో సమ్మేళనాలను నిర్వహించని మండల అధ్యక్షులపై పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు.

లాభదాయకం గొర్రెల పెంపకం

- మాంసానికి పెరుగుతున్న డిమాండ్
- జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు రావని సూచిస్తున్న శాస్త్రవేత్తలు







మామునూరు కేవీకేలో పెంచుతున్న గొర్రెలు (ఇన్‌సెట్) విత్తన పొట్టేళ్లు

కరీమాబాద్: రోజురోజుకు మాంసానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెల పెంపకం లాభదాయకంగా మారనుంది. వ్యవసాయం చేస్తున్నట్లు, కోళ్ల ఫాంలు పెట్టినట్లుగానే గొర్రెల పెంపకం కూడా చేపట్టినట్లయితే రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా మారుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గొర్రెల ఎంపిక, వసతి, పునరుత్పత్తి, ఆరోగ్య సంరక్షణ లాంటి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే సమస్యలు రావని పేర్కొంటున్నారు.

పొట్టేళ్ల ఎంపిక కీలకం..

గొర్రెల పెంపకంలో పొట్టేళ్ల ఎంపిక కీలకంగా మారనుంది. గొర్రెల మంద పునరుత్పత్తిలో భాగంగా 'విత్తన' పొట్టేళ్ల పాత్ర ఎంతో ఉంటుంది. ప్రతీ ఆడ గొర్రె నుంచి సంవత్సరానికి 1 లేదా 2 కన్న ఎక్కువ పిల్లలు లభించవు. అదే విత్తన పొట్టేలుతో 50 నుంచి 75 వరకు పొందవచ్చు. అందుకే 'ఒక' విత్తన పొట్టేలు మందలో 'సగం' అంటారు. కనీసం 18 నెలల విత్తన పొట్టేలు ఎంపిక చేసుకోవాలి. వాటిని 2, 3 సంవత్సరాలకు ఒకసారి మార్చి కొత్త వాటిని తెచ్చి మందలో కలిపినట్లయితే ఆరోగ్యవంతమైన గొర్రెపిల్లలు పుడుతాయి.

వ్యాధులు.. ఆరోగ్య పరిరక్షణ

సహజంగా గొర్రెలకు వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. గొర్రెల్లో ఎక్కువగా నీలి నాలుక వ్యాధి, చిటుక్కు రోగం, కాలి పుండ్ల వ్యాధి, బొబ్బ రోగం, గాలి కుంటు వ్యాధి తదితర వ్యాధులు వస్తుంటాయి. అవి వ్యాప్తి చెందకుండా పాకలో తేమ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. సాయంత్రం వేప ఆకుతో పొగ వేయాలి. ఈ క్రమంలోనే గోమారులు రాకుండా పాకల్లో సుమథియాన్, మలాథియాన్ మందులు పిచికారీ చేయాలి. అంతే కాకుండా ప్రతీ 15 రోజులకు ఒకసారి పాకలో పొడి సున్నం చల్లాలి. సంవత్సరంలో కనీసం 3 సార్లు నట్టల నివారణ మందులను తగిన మోతాదులో తాగించాలి.

గొర్రెల్లో పునరుత్పత్తి..

గొర్రెల పెంపకం దారులు విత్తన పొట్టేలును ఎక్కువ రోజులు మందలో ఉంచకూడదు. రాత్రి పూట మాత్రమే మందలో జత కలపాలి. ఈ క్రమంలోనే పునరుత్పత్తి సక్రమంగా జరగాలంటే ప్రతీ 100 ఆడ గొర్రెలకు 3 విత్తన పొట్టేళ్లను అందుబాటులో ఉంచాలి. ఆడ గొర్రెలకు మినరల్ మిక్చర్‌ను క్రమం తప్పకుండా వాడినట్లయితే ఎదకొచ్చి చూడి నిలవడానికి అవకాశం ఉంటుంది.

పాకల నిర్మాణం..

గొర్రెల పెంపకందారులు పాకల నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దు. ఖర్చుకు వెనకాడకుండా వాతావరణంలో వస్తున్న మార్పులకనుగుణంగా పాకలు నిర్మించుకోవాలి. గొర్రెలు సులువుగా తిరగడమే కాకుండా విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా గాలి, వెలుతురు లభించేలా చూసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



"గొర్రెల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు జాగ్రత్తలు పాటిస్తూ పెంచడం ద్వారా లాభాలు పొందవచ్చు. పిల్లల దశ నుంచి వాటి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యాధులను బట్టి మందులు వాడుతూ ఉండాలి. ముఖ్యంగా పాక శుభ్రంగా ఉంచుకోవాలి. సరైన విత్తన పొట్టేలును ఎంపిక చేసుకోవాలి.

-డాక్టర్ రాజన్న, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

విద్యార్థులకు రాష్ట్రపతి ప్రశంసలు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్రపతి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తూ సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్రం నిర్వహిస్తున్న విజ్ఞాన మేళ పోటీల్లో మానుకోట జిల్లా విద్యార్థులు పాల్గొని సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మేళాలో మానుకోట జిల్లా విద్యార్థులు ఎడ్ల నాని, నక్క భవానీల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఎన్ఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలను సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. తెలంగాణ నుంచి ఎంపికైన 8 ప్రదర్శనలను రాష్ట్రపతి తిలకించి ప్రత్యేకంగా విద్యార్థులతో మాట్లాడి వారు ప్రదర్శించిన ప్రదర్శనల గురించి అడిగి తెలుసుకుని అభినందించారు. దేశవ్యాప్తంగా 60 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా తెలంగాణ నుంచి 8 మంది విద్యార్థులు హాజరు కాగా, మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభ చాటుతున్నారు. పెద్దవంగర ప్రభుత్వ పాఠశాలలో నాని 9వ తరగతి, మోడల్ స్కూల్‌లో నక్క భవాని 10వ తరగతి వరకు చదువుకుంది. భవాని ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం నేరడ మోడల్ స్కూల్‌లో పూర్తి చేసింది. కాగా అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను,గైడ్ టీచర్లను మంగళవారం కలెక్టర్ కె. శశాంక అభినందించారు.

క్లుప్తంగా

నేటి నుంచి దూరవిద్య పీజీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నేటి నుంచి (12వ తేదీ) పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ మంగళవారం తెలిపారు. పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈనెల 12, 15, 18, 20, 24 తేదీల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 13, 17, 19, 21, 25 తేదీల్లో పరీక్షలు జరుగనున్నాయి. ప్రథమ సంవత్సరంలో 2,825, ద్వితీయ సంవత్సరంలో 2,154 మంది, మొత్తం 4,971మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5, ఖమ్మం జిల్లా కేంద్రం ఒకటి మొత్తం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పరీక్షలు ఆయా తేదీల్లో టైం టేబుల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు జరుగుతాయన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్ పాటు, ఒక అబ్జర్వర్, రెండు ప్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థులు కేయూ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ప్రశ్న పత్రాలను ఆన్‌లైన్‌లోనే పరీక్ష కేంద్రాలకు కొద్ది సమయం ముందు పంపుతారన్నారు.

ఎల్లంబజార్‌లో చైన్‌స్నాచింగ్

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లంబజార్‌లో ఓ మహిళ మెడలో నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మూడు తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎల్లంబజార్‌కు చెందిన దీపలక్ష్మి అనే మహిళ రాత్రి సమయంలో ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న విషయాన్ని గమనించిన సదరు దుండగులు ఆకస్మాత్తుగా అటువైపుగా వాహనంపై వచ్చి మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: మతవిద్వేశాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత కేశవరాజ్ జీపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగశాయిపేట మహంకాళి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం వీహెచ్‌పీ నేత కేశవరాజ్ ఇతరులతో మతవిద్వేశాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ, హిందూ మతాన్ని రక్షించాలని మాట్లాడినట్లు ఎస్సై కుమార్ ఫిర్యాదు చేశారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మమ్మీ.. డాడీ ఐయామ్ సారీ..

- ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- ఎంబీబీఎస్ సీటు రాదేమోనని అఘాయిత్యం



కృష్ణ(ఫైల్)



కృష్ణ రాసిన సూసైడ్ నోట్

కేసముద్రం: 'మమ్మి, డాడీ ఐయామ్ సారీ... నాకు ఎంబీబీఎస్ సీటు రాదెమోనని అనిపిస్తుంది'అని సూసైడ్ నోట్ రాసిన ఓ ఇంటర్ విద్యార్థి ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పీక్లాతండాజీపీ శివారు బోడగుట్టతండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన గుగులోతు లచ్చు, జ్యోతి దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు కృష్ణ(19) ఏటూరు నాగారంలోని ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో ఇంటర్మీడియట్(బైపీసీ) చదివి, ఇటీవల పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. ఎంబీబీఎస్ సీటు సాధించాలనే లక్ష్యం ఉన్న కృష్ణ, ఇంట్లో గోడలపై ఎంబీబీఎస్ నా డ్రీమ్ అంటూ రాసుకున్నాడు. ఈ మేరకు నీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈక్రమంలో తల్లి పంటచేను వద్దకు వెళ్లగా, తండ్రి కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి అమ్మేందుకు వెళ్లాడు. తమ్ముడు ప్రభాకర్ పదవ తరగతి పరీక్ష రాసేందుకు కల్వల మోడల్ స్కూల్‌కి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కృష్ణ, తనకు ఎంబీబీఎస్ సీటు రాదెమోనని మనస్తాపం చెంది, ఐయామ్ సారీ మమ్మి, డాడీ అంటూ సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తాత ఇంట్లోకి వచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని, కొడుకు మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం

- అభివృద్ధిని చూసి ఆదరించాలి
- మంతి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఉషాదయాకర్‌తో కలిసి నృత్యం చేస్తున్న దయాకర్‌రావు

పాలకుర్తి: బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం.. కార్యకర్తలే బలమని, దేశంలో ఏ పార్టీకి లేనంత 80 లక్షల కార్యకర్తల బలగం మనదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని వావిలాల, ముత్తారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా స్థానికులు ఎద్దుల బండిపై ఊరేగింపు.. డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, ఎర్రబెల్లి చారిటబుల్ ఛైర్ పర్సన్ ఉషా దయాకర్‌రావుతో కలిసి మంత్రి దయాకర్ రావు ప్రసంగించారు. పార్టీ బలోపేతం, పటిష్టకు చేపట్టే ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో బీజేపీ ఉందని, కాంగ్రెస్ బీజేపీ వంత పాడుతుందన్నారు. నియోజకవర్గంలో ఒక్కో గ్రామ పంచాయతీలకు కోటిన్నర నుంచి రెండున్నర కోట్ల మేర ఖర్చు చేసి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నామన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి పార్టీని మళ్లీ ఆదరించాలని కోరారు. అనంతరం దయాకర్‌రావు దంపతులు కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పూస్కూరి శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, సర్పంచ్‌లు గంట పద్మ, కల్వాల బాస్కర్‌రెడ్డి, కత్తి సైదులు, గుగులోతు వాలు నాయక్, మహేందర్, ఎంపీటీసీలు సోమనారాయణ, నల్లపు మౌనిక, ఎఫ్ఎస్‌సీ ఛైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముస్కు రాంబాబు, పీఏసీఎస్ ఛైర్మన్ మైసిరెడ్డి, నాయకులు సైదులు, వెంకన్న, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

- కేసు నమోదు



చికిత్స పొందుతున్న సునీత

దంతాలపల్లి: మహబుబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకోగా మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలోజు కుమారస్వామి (వడ్రంగి) అదే గ్రామానికి చెందిన ఏరుకొండ ప్రవీణ్ ఇంటికి సోమవారం రేకులు వేశాడు. అదేరోజు సాయంత్రం ఏరుకొండ నరేష్ అనే వ్యక్తి సమారు 5 గంటల ప్రాంతంలో కత్తి పట్టుకొని కుమారస్వామి ఇంటికి వెళ్లి ప్రవీణ్ ఇంటికి రేకులు ఎలా వేస్తావని, నిన్ను చంపుతానని బెదిరించాడు. ఆ సమయంలో కుమారస్వామి ఇంట్లో లేకపోవడంతో అతని భార్య సునీతను విచక్షణ రహితంగా పొడిచాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నరేష్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారికి కూడా కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. గ్రామస్తుల సాయంతో సునీతను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కుమారస్వామి కుమారుడు ఏకాంబరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సారయ్య మృతదేహం

దుగ్గొండి: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన ముప్పారపు సారయ్య(67) పక్కనే ఉన్న స్వామిరావుపల్లి గ్రామంలోని ఓ రైతుకు మిర్చి ఏరడానికి మంగళవారం కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పని పూర్తి కాగానే అక్కడే కాసేపు సేదదీరుదామని వేప చెట్టుకింద కూర్చున్నాడు. కాసేపటికి ఒక్కసారిగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పదేళ్ల క్రితం మృతి చెందగా ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు..



వెంకటేశ్ మృతదేహం

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన బద్ది మధునక్క, రాజయ్య కుమారుడు వెంకటేశ్ (13) అనే బాలుడు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి సమీపంలోని చెరువు వద్ద గల చెట్టు కింద వెంకటేశ్ విఘతజీవిగా పడి ఉన్నాడు. ఇది గమనించిన పలువురు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా వెంకటేశ్ మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకటేశ్ ఉదయం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై వెళ్లాడని, బాలుడి తల భాగంలో గాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ట్రాక్టర్ పైనుంచి పడి మృతి చెంది ఉంటాడా లేక వేరే ప్రమాదం ఏమైన జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల అదుపులో పోకిరీలు!

- దాడిపై సర్వత్రా విమర్శలు
- కఠినంగా శిక్షించాలని స్థానికుల డిమాండ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ వివేకానందకాలనీలో ఆదివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నిందితులు ఇంతేజార్‌గంజ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వివేకానందకాలనీకి చెందిన సిరివెల్ల వినోద్ ఓ సిటీలోని ఫంక్షన్‌కు వెళ్లి ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న క్రమంలో కాశిబుగ్గకు చెందిన ముగ్గురు పోకిరీలు బైక్‌పై అతివేగంగా పక్క నుంచే వెళ్లడంతో వినోద్ జడుసుకున్నాడు. జర చూసుకొని పోవాలంటూ వారితో అనడంతో వారు కోపోద్రిక్తులై వినోద్‌ను తీవ్రంగా కొట్టడంతో కాళ్లు, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. వినోద్ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయినట్లు భావించి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే వినోద్ అన్న హరిప్రసాద్ 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. అమాయకుడైన వినోద్ రెండు కాళ్లు, కుడి చేయి విరిగేవిధంగా కొట్టడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోకిరీలను కేసు నుంచి తప్పించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించడంపై తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించక పోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

కుమార్తెలకు విషమిచ్చిన తండ్రి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

పాలకుర్తిటౌన్: భార్యపై కోపంతో ఇద్దరు కుమార్తెలకు విషమిచ్చిన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో పెద్ద కుమార్తె చికిత్స పొందుతూ మృతి చెందగా చిన్న కుమార్తె మృత్యువుతో పోరాడుతోంది. కేసు వివరాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్‌లతో కలిసి ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. పాలకుర్తి మండలంలోని గూడూరు శివారు జానకీపురానికి చెందిన గుండె శ్రీను తన భార్య ధనలక్ష్మిపై కోపంతో కుమార్తెలు నాగప్రియ(9), నందిని (5)లకు విషమిచ్చాడు. అపస్మారక స్థితికి చేరిన పిల్లలను జనగామ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించాడు. పెద్ద కుమార్తె నాగప్రియ మృతి చెందగా, రెండో కుమార్తె నందిని చికిత్స పొందుతోంది. భార్య ఫిర్యాదు మేరకు శ్రీనుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కూలీ హత్య కేసులో ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

పెద్దవంగర: వంద రూపాయల కోసం కూలీతో ఘర్షణ పడి హత్య చేసిన యజమానిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్సై పిల్లల రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన దుర్సోజు మురళి (55) కుల వృత్తి వడ్రంగి పనుల తో పాటు కూలీ పనులు చేసుకుంటూ తల్లి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు ముత్తినేని రాములుకు ఈ నెల 6న కూలీ పనులకు వెళ్లాడు. కూలీ డబ్బులు కోసం అదే రోజు రాత్రి 9:30 గంటలకు ఇంటికి వెళ్లి అడిగాడు. రాములు డబ్బులు ఇవ్వక పోవడంతో కూలీ పనులకు వెళ్లిన మురళి మద్యం మత్తులో రాములుకు చెందిన బస్సు డోర్ అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన రాములు తన వద్ద ఉన్న కర్రతో విచక్షన రహితంగా దాడి చేశాడు. బలమైన గాయాలు కావడంతో ఈ 7న మురళి మృతి చెందాడు. తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం ముత్తినేని రాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

కాలికి నిప్పంటించిన ఘటనలో యువకుడు..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గట్టు మనూష్ అనే తొమ్మిదేళ్ల బాలుడి కాలికి నిప్పు పెట్టిన ఘటనలో నిందితుడు జిట్టె రాజును మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7న కొత్తపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గట్టు మనూష్ అనే బాలుడు ఆడుకుంటుంటే అదే గ్రామానికి చెందిన రాజు, అభినవ్‌లు వెళ్లి బాలుడి కాలికి కాటన్ కట్టి నిప్పంటించారు. దీంతో బాలుడి తండ్రి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

వరంగల్‌లో టూరిజం అభివృద్ధి

- సదరన్ ట్రావెల్స్ ప్రారంభోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, సదరన్ ట్రావెల్స్ ప్రతినిధులు

నయీంనగర్: వరంగల్‌లో టూరిజం, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిందని, సదరన్ ట్రావెల్స్ సేవలు ఇక్కడ కూడా అవసరమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం నయీంనగర్ పుష్పాంజలి కాంప్లెక్స్‌లో సదరన్ ట్రావెల్స్ కార్యాలయాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ టూరిజం, ట్రావెల్స్ రంగంలో సదరన్ ట్రావెల్స్‌కు మంచి పేరుందని, 50 ఏళ్లుగా ఈ సంస్థ దేశ విదేశాల్లో సేవలందిస్తుందన్నారు. యాత్రికులకు దేశ వ్యాప్తంగా మంచి ప్యాకేజీలు ఉన్నాయన్నారు. సదరన్ గ్రూప్ జేఎండీ అళపాటి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సదరన్ గ్రూప్ కంపెనీ అత్యంత ప్రతిష్టాత్మకమైన సదరన్ గ్రాండ్ కాశీని ప్రధాని మోదీ మార్చి 28న ప్రారంభించారని తెలిపారు. వరంగల్ నూతన కార్యాలయంలో దేశీయ, అంతర్జాతీయ విహార యాత్రలు, తీర్థయాత్రలను, విమాన టికెట్లు, ప్రపంచ వ్యాప్తంగా హోటల్ రిజర్వేషన్లు, వీసా సేవలు అందిస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదిలో సంస్థ మరో 50 బ్రాంచీలతో విస్తరించే ప్రక్రియలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.